# హైటెక్ పెళ్ళి

పెనుమూక నాగేశ్వరరావు



"తాతయ్యా! రవి పెళ్లిట! టెలిగ్రాం వచ్చింది." మనవడు మధు చెప్పిన వార్త విని విస్తుపోయాడు విశ్వనాథం.

"టెలిగ్రాం ఏమిట్రా? శుభలేఖ లేకుండా ఏకంగా టెలిగ్రాం ఇచ్చేటంత హడావుడేమిటట?"

"శుభలేఖలా! ఇంకా ఈ రోజుల్లో శుభలేఖలేమిటి, తాతయ్యా! టెలిగ్రాం కూడా నీకోసం పంపాడు పెదనాన్న. లేకపోతే అదీ ఉండదు!"

"అంటే, అయినవాళ్లక్కూడా తెలీకుండానే పెళ్లిళ్లు చేసేసుకుంటున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అది కాదు, తాతయ్యా! ఇప్పుడు మీ రోజుల్లోలా శుభలేఖలు అచ్చు వేయించడం, ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి పెళ్లి పిలుపు పేరిట ఆర్భాటం చేయటం ఏమీ లేవు. మరీ ముఖ్యమైన వాళ్లనుకుంటే టెలిఫోన్‌లో చెప్పేస్తారు. మిగిలిన అందరికీ టీ.వీ.లో ప్రకటనిస్తారు. అంతే! ఇంకా కావాలనుకుంటే దినపత్రికల్లో వేయిస్తున్నారు కొంతమంది!" వివరంగా చెప్పాడు మధు.

"ఎంత తీరిక లేని బతుకులైతే మాత్రం, ఈ తీరా?" విస్మయంగా అన్నాడు.

"అవును, తాతయ్యా! రోజులు మారిపోతున్నాయి. ఎప్పుడూ మీ కాలంలోలానే జరిగిపోవాలంటే ఎలా?"

"అవునేమోలే కానీ, ఇంతకీ ముహూర్తం ఎప్పుడ్రా?" ఆసక్తిగా అడిగాడు విశ్వనాథం.

"ఎల్లుండి రాత్రి పదకొండు గంటలకి, తాతయ్యా!"

"అయితే మరి మనం రేపే బయల్దేరాలిగా!"

"ఎక్కడికి? పెళ్లికా! పెళ్లి చూసేందుకు ఇక్కడ్నుంచి అదేపనిగా అంతదూరం వెళ్దామా!" పగలబడి నవ్వాడు మధు.

"ఇందులో అంత నవ్వాల్సిందేముందిరా?" అర్థంకాక అడిగాడాయన.

"అదికాదు, తాతయ్యా! పెళ్లయిపోయాక ఓ నాలుగైదు రోజులకు టీ.వీ.లో మూడు నిముషాలు రవి పెళ్లి తతంగం చూపిస్తారు. మనం మన ఇంట్లోనే కూర్చుని వాడి పెళ్లి చూడచ్చు!"

"పెళ్లికి వెళ్లనవసరం లేదా? ఇంట్లోనే కూర్చుని టీ.వీ.లో చూడాలా? ఏమిటో ... అంతా అయోమయంగా ఉంది!" గొణిగినట్లుగా అన్నాడు విశ్వనాథం.

"అదంతేలే, నే కాలేజీకి వెళ్తున్నా, టైమైంది!" అంటూ బయటకు నడిచాడు మధు.

పెద్దకొడుక్కి పుట్టిన ప్రథమ సంతానం రవి. ఎంతో గారాబంగా పెంచారు ఆ ఇంట్లోవాళ్లంతా అతన్ని. అందరికంటే విశ్వనాథానికి రవి అంటే పంచప్రాణాలు. రాత్రిళ్లు తన పొట్టమీద పడుకోపెట్టుకుని నిద్రపుచ్చేవాడు. పెద్దకోడలి నిష్ఠూరాలు భరించలేక, భార్య గతించిన కారణంగా ఒంటరిగా మిగిలిపోయిన విశ్వనాథం గత కొన్నేళ్లుగా చిన్నకొడుకు దగ్గర ఉంటున్నాడు. మమకారం చావక మనవడి పెళ్లి చూడాలని తహతహపడిపోతున్నాడు.

ఒంటరిగా వెళ్లేందుకు కళ్లూ, కాళ్లూ తన అధీనంలో లేవు. తనకు తోడుగా వచ్చేందుకు ఎవరికీ తీరికలేదు, కోరికా లేదు. ఏమీ చేయలేని విశ్వనాథం తన కోరికను మనసులోనే అణుచుకున్నాడు.

చివరి ప్రయత్నంగా సాయంత్రం కొడుకుని కూడా ఓసారి అడిగి చూడాలనుకున్నాడు. కాదంటే

మాత్రం వాళ్లని ఇబ్బంది పెట్టదలుచుకోలేదాయన. యథాలాపంగా పేపరందుకున్నాడు. రవి పెళ్లి ప్రకటన కంటపడింది. మనవడి ఫొటో, పేరు, కిందనే కొడుకు కోడలి పేర్లు చూడగానే ఆయన కళ్లల్లో నీటి పొర. మనసంతా ఉద్వేగంతో నిండిపోయింది. ఆప్యాయంగా మనవడి ఫొటో చేత్తో తాకి ముద్దుపెట్టుకున్నాడు. తదేకంగా ఆ ప్రకటననే చూస్తూండిపోయాడు చాలాసేపు.

"రవి పెళ్లిట! మనం వెళ్లొద్దాంరా!" ఆశగా అడిగాడు ఆఫీసునుంచి వచ్చిన కొడుకుని.

"అంతంత ఛార్జీలు పెట్టుకుని ఎక్కడ వెళ్తాం, నాన్నా! ఆఫీసుకు సెలవు పెట్టడం కూడా కష్టం. పైగా టీ.వీ.లో చూడొచ్చు కదా!"

కొడుకు సమాధానం అసంతృప్తి కలగచేసింది విశ్వనాథానికి. అయినాసరే మరో మాట మాట్లాడకుండా ఉండిపోయాడాయన.

"సరే, కనీసం ఆ టీ.వీ.లో ఆ వేడుక వచ్చే వేళకయినా అందరూ ఇంట్లో ఉండండి!" అన్నాడు ప్రాధేయపడుతున్నట్లుగా.

"వాడి పెళ్లి కళ్లారా చూసి నాలుగు అక్షింతలు వేద్దామనుకున్నాను!" మనసులోని కోరిక బయటికే అనేశాడు విశ్వనాథం చివరి ప్రయత్నంగా.

"ఇంకా ఈ రోజుల్లో అక్షింతలూ, ఆశీర్వచనాలూ ఏమిటి నాన్నా, చాదస్తం కాకపోతే!" విసుగ్గా అన్నాడు కొడుకు.

వైరాగ్యంతో కూడుకున్న చిరునవ్వు ఆయన పెదవులపై మెరిసింది ఓ క్షణం.

'అనారోగ్యంగా ఉన్నారని తెలిస్తే ఫోనుద్వారా పరామర్శలు, పుట్టినరోజులకు, పెళ్లిరోజులకు టీ.వీ.ల ద్వారా శుభాకాంక్షలు తెలియచేయడం, చనిపోయారని తెలిస్తే పేపర్లలో సంతాప ప్రకటనలు ... ఇలా తగలడుతున్నాయి మానవ సంబంధాలు!

కుశల ప్రశ్నలు వేసుకునేంత తీరుబడి లేదు. కష్టసుఖాలు చెప్పుకునే కలివిడితనం లేదు, ఓదార్పో, ధైర్యమో, సహాయమో, సహకారమో అందించాలన్నా ఆత్మీయతల్లేవు!

సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్నామన్న సంబరం తప్ప, సహజీవనంలో ఉండే నిజమైన ఆనందపు రుచిని చవిచూడలేకపోతున్నామన్న స్పృహే కరువైపోతున్నది. అందరూ ఉండికూడా ఎవరికి వారే ఒంటరి బతుకు వెళ్లదీస్తున్నారు!' కోడలు భోజనానికి పిలవడంతో చుట్టు ముట్టిన ఆలోచనల్లోంచి బయటపడ్డాడు విశ్వనాథం.

● ● ●

అందరూ హాల్లో టీ.వీ. ముందు కూర్చున్నారు. మరో అయిదు నిముషాల్లో మనవడి పెళ్లి వేడుక చూడబోతున్నందుకు ఆనందంగా ఉంది విశ్వనాథానికి. చాలాకాలం తర్వాత అయినవాళ్లని, ముఖ్యంగా మనవడ్ని, కొడుకుని, కోడల్ని, మనుమరాల్ని చూడబోతున్నందుకు ఆయన మనసంతా సంబరంగా ఉంది. అయిదు నిముషాలూ అయిదు యుగాల్లా గడిపాడు. రవి పెళ్లి ప్రకటన వెలువడింది.

ముందుగా దేవుడి పటం.

తర్వాత కళ్యాణ మండపం ముందు వధూవరుల పేరు రాసి ఉన్న బోర్డు.

కళ్యాణ వేదిక.

పెళ్లికొడుకు ముస్తాబుతో కనిపించాడు రవి.

మసకబారిన కళ్లను గట్టిగా తుడుచుకుని చూడసాగాడు విశ్వనాథం.

పెళ్లికూతుర్ని చూపించారు.

ఒక్క క్షణం కొడుకు, కోడలు నవ్వుతూ కనిపించారు.

విశ్వనాథం గుండె వేగంగా కొట్టుకుంది. అంతకన్నా వేగంగా టీ.వీ.లో బొమ్మలు మారిపోతున్నాయి.

మాంగల్యధారణ.

తలంబ్రాలు.

ఒకదానివెంట ఒకటి త్వరత్వరగా మారిపోతున్నాయి దృశ్యాలు.

అంతలోనే ఆహుతుల్ని చూపసాగారు. పెళ్లికి వచ్చిన సినిమా యాక్టర్లని చూసి విస్తుపోయాడు విశ్వనాథం. వాళ్లు అక్షింతలు వేయడం, వాళ్లకి వధూవరులు నమస్కారం చేయటం, కార్లలో తరలివెళ్లడం, అంతలోనే శుభం పడటం జరిగిపోయింది.

ఒక్కసారిగా విశ్వనాథం ముఖం చిన్నబోయింది. "వీళ్లంతా వీడికి ఎప్పుడింతగా పరిచయం అయ్యారు? పెళ్లికి వచ్చేటంత దగ్గరివారు ఎలా అయ్యారు?" ఆశ్చర్యంగా అన్నాడాయన.

"వాళ్లంతా రవి పెళ్లికి రాలేదు, తాతయ్యా! వీడియో వాళ్లు మనం అడిగితే అలా టేపు తయారుచేసిస్తారు. మనకి ఇష్టమైన యాక్టర్లపేరు చెప్తే వాళ్లు పెళ్లికి వచ్చినట్లుగా తీయగలరు!" వివరించాడు రవి.

"మన బంధువులందరినీ చూడొచ్చు కదా అని ఆశపడ్డా(నా! ఒక్కరూ కనిపించలేదు. మీ పెదనాన్న కూడా ఒక్క క్షణం అలా కనిపించాడంతే!" నిరాశగా అన్నాడు విశ్వనాథం.

"పెళ్లి అంతా చూపించాలంటే అరవై లక్షలవుతుంది, తెల్సా?" వెటకారంగా అన్నాడు మధు.

పెద్దగా నవ్వారు పక్కనే ఉన్న కొడుకూ, కోడలూ.

అంతకన్నా పెద్దగా ఏడ్చాడు మనసులోనే విశ్వనాథం. ■


రైతు లోకానికి సంక్రాంతి శుభాకాంక్షలు

నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకత్రయం
సమతుల్యంగా వాడితే సిరిసంపదలే నిరంతరం

సుఫల ఉజ్వల

20:20:0 ప్రిల్డ్
15:15:15

యూరియా 46%N

రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
ఆం.ప్ర. మార్కెటింగ్ ఆఫీసు:
శ్రీ లక్ష్మీ కాంప్లెక్స్, మొదటి అంతస్తు,
10-2-289/25, శాంతినగర్, హైదరాబాద్-28.